

50 శాతం రాయితీపై పశుదాణా

పార్వతీపురం, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణా అందించనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మన్మథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు 50 కిలోల చొప్పన జూన్ వరకు మూడు బస్తాలు ఇస్తామన్నారు. పశువైద్య కేంద్రం లేదా రైతు సేవా కేంద్రంలో పాడిరైతులు రూ.555 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆవులు లేదా గేదెలకు ఐఎన్ ఏపీహెచ్ చెవిపోగు ఉండాలని, రైతులకు తెల్లరేషన్ కార్డు, పశుగణనలో నమోదు తప్పనిసరి అని పేర్కొన్నారు. మూగజీవాలకు టీకాలు వేయించి ఉండాలన్నారు.

అక్రమాలకు చెక్!

పార్వతీపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణాల చెల్లింపుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. రుణాలు పొందిన వారు ప్రతి నెలా ఎవరికి వారే వాయిదాలు చెల్లించేలా పేమెంట్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా చెల్లింపులు జరిగేలా చూడాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 19,880 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 2,28,716 మంది సభ్యులు ఉన్నారు. గత ఏడాది రూ.55 కోట్ల వరకు రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే రూ.50 కోట్లకు పైబడి రుణాలు అందించారు. ఈ ఏడాది 8,666 మంది మహిళా సంఘ సభ్యులకు స్త్రీనిధి ద్వారా రూ.86.66 కోట్ల వరకు రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కొన్నిచోట్ల ఇలా..

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో .. రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు తిరిగి వాయిదాలు చెల్లించే సమయంలో అనేక అవకతవకలు జరిగాయి. కొంతమంది విలేజ్ ఆర్గనైజింగ్‌కు చెందిన ప్రతినిధులు రుణ వాయిదాలను సభ్యుల నుంచి తీసుకుని సంబంధిత ఖాతాలకు జమ చేయలేదు. దీంతో ఆ నిధులు పక్కదారి పట్టాయి. మరోవైపు మహిళా సంఘాల సభ్యుల పేరిట రుణాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. కొంతమంది నిరక్షరాస్యులైన సభ్యులు దీనిని తెలుసుకోలేకపోయారు. తమ రుణం తీరిపోయిందని భ్రమలో ఉన్న వారికి బ్యాంకులు నోటీసులు ఇచ్చాయి. రుణాలపై అధిక వడ్డీలు వడ్డిస్తూ రికవరీకి నోటీసులు అందిస్తుండడంతో సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. దీనిపై ఏం చేయాలో తెలియక తలలు పట్టుకున్నారు. అయితే ఇకపై పరిస్థితి తలెత్తకుండా కూటమి ప్రభుత్వం పేమెంట్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

నష్టపోతున్న సభ్యులు...

కొంతమంది రికవరీ ప్రతినిధుల తీరుతో మహిళా సంఘ సభ్యులు నష్టపోతున్నారు. అధిక మొత్తంలో వాయిదాలను వసూలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఉదాహరణకు స్త్రీనిధి ద్వారా రూ.50 వేల రుణం తీసుకుంటే వడ్డీతో కలుపుకుని రూ.2,500 చొప్పున

(మిగతా 8వ పేజీలో...)

Powered by Paytm Payments Bank

- స్త్రీనిధి రుణాల చెల్లింపు ఇక యాప్ ద్వారానే..
- నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- వైసీపీ హయాంలో ఎన్నో అవకతవకలు
- కొంతమంది విలేజ్ ఆర్గనైజింగ్ ప్రతినిధులపై ఆరోపణలు
- ఏళ్లు గడుస్తున్నా వారి నుంచి రికవరీ చేయని వైనం
- ఇబ్బందుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విన్నపం

రుణ వాయిదాలను చెల్లించేందుకు కొత్తగా వినియోగిస్తున్న పేటీఎంలు



మహిళా సంఘ సభ్యుల సమావేశం (ఫైల్)



టీకే జమ్ములో సిగ్నల్స్ లేక సచివాలయంలో నిరీక్షిస్తున్న గిరిజనులు

సిగ్నల్స్ లేక.. సేవలు అందక!

- ఏజెన్సీలోని సచివాలయాల్లో ఉద్యోగులు డీలా
- గిరిజనులకు తప్పని నిరీక్షణ
- ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి..
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టవర్ల ఏర్పాటు
- కొరవడిన పర్యవేక్షణ.. పకడ్బందీ చర్యలు శూన్యం

జియ్యమ్మవలస, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లోని పలు సచివాలయాల్లో ఫైబర్ నెట్ సక్రమంగా పనిచేయడం లేదు. పూర్తిస్థాయిలో సిగ్నల్స్ అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోకపోవడం, నెట్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గిరిజనులకు అందాల్సిన సేవలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. గిరి శిఖర గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గత ఎనిమిది నెలలుగా ఈ సమస్య వేధిస్తుండగా స్పందించే వారే కరువయ్యారు. దీంతో అటు ఉద్యోగులు, ఇటు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

జియ్యమ్మవలస మండలంలో టీకే జమ్ము, పీటీ మండ, కొండచిలకాం పంచాయతీల పరిధిలో 22 గిరిజన గ్రామాలు ఉన్నాయి. గతంలో ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఆఫ్‌లైన్‌లోనే సేవలు అందేవి. అయితే గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ సేవలు అందించేందుకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీకే జమ్ము, పీటీ మండలో సెల్ టవర్లు నిర్మించారు. దీనికి ఫైబర్ నెట్ కనెక్షన్ ఇచ్చారు. అయితే కొంతవరకు పరిస్థితి మెరుగుపడినా.. కాలక్రమంలో సిగ్నల్ సమస్య మాత్రం తీవ్రంగా వేధిస్తోంది. సచివాలయం ద్వారా ఈ మూడు పంచాయతీల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఫైబర్ నెట్ మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారే లేరు. దీంతో ప్రభుత్వ సేవలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. కొన్నిసార్లు సిగ్నల్స్ ఉన్న ఘాట్ రోడ్లకు సచివాలయ ఉద్యోగులు పరుగులు తీస్తున్నారు. ఇదే సమయంలో పీ4 సర్వే సమయంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీకే జమ్ము పంచాయతీలో రేషన్ పంపిణీ విషయంలో ఇక్కట్లు తప్పడం లేదు. సెల్‌ఫోన్ ద్వారా ఇతర ప్రాంత ప్రజలకు మాట్లాడాలన్నా కష్టమే. జియ్యమ్మవలస మండలంతో పాటు సీతంపేట, భామిని, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, మక్కువ, పాచిపెంట మండలాల్లోని ఏజెన్సీ పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



పీటీ మండలో ఏర్పాటు చేసిన సెల్ టవర్

అందాల్సిన సేవలు

సచివాలయాల ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలను ప్రజలకు జారీ చేయాల్సి ఉంది. పింఛన్లు, రేషన్ కార్డులు, నూతన గృహాల మంజూరు దరఖాస్తులతో పాటు ఆధార్ అప్‌డేషన్, రేషన్ కార్డుదారుల

(మిగతా 8వ పేజీలో...)

ప్రత్యామ్నాయం చూడాలి

గతంలో ఫైబర్ నెట్ ద్వారా సిగ్నల్స్ అందించే ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం సిగ్నల్స్ లేకపోతే సచివాలయ ఉద్యోగులు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలి. అంతేకాని ప్రభుత్వ సేవలకు విఘాతం కలిగించరాదు.

- టి.కొండలరావు, డీపీవో, పార్వతీపురం మన్యం



మలేరియాపై అప్రమత్తం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మలేరియాపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గిరిజన గ్రామాల్లో కేసులు నమోదు కాకుండా చూడాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ.. 'ఏజెన్సీలో మలేరియా నివారించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. వ్యాధి వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం మెరుగు వంటి వాటిపై పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. గిరిజన గ్రామాల్లో తరుచూ వైద్య పరీక్షలు నిర్వహించాలి. మలేరియా పరీక్షల కిట్లను ఏఎన్ఎంలకు అందించాలి. పాజిటివ్ వచ్చిన రోగులకు వెంటనే చికిత్స ప్రారంభించాలి. సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులకు రిఫర్ చేయకుండా పీహెచ్‌సీ స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలి. మందుల కొరత లేకుండా చూస్తాం. మలాథిన్ స్ప్రేయింగ్ అన్ని గ్రామాల్లో చేయించాలి. దీనిని సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలి. పాజిటివ్ వచ్చిన రోగితో పాటు ఆ సమీపంలోని పది కుటుంబాలకు చెందిన సభ్యులకు కూడా మలేరియా పరీక్షలు నిర్వహించాలి. మైనింగ్ కోసం కొండలను తవ్వే క్రమంలో ఏర్పడిన గోతుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి.' అని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు పిలుపు

పార్వతీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శోభిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 18 లోగా టీడబ్ల్యుఆర్ఈఐఎస్‌సీఈటీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో అన్ని గ్రూప్‌లకు కలిపి 800 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. పి.కోనవలస గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో (బాలికలు) ఎంపీసీ కోర్సుకు 40, బైపీసీ 40, సీఈసీ 40, ఏఅండ్‌టీ 20 సీట్లు కేటాయించామన్నారు. కురుపాం (బాలికలు)లో ఎంపీసీ కోర్సుకు 40, బైపీసీ 40, సీఈసీ 40, పి.కోనవలస (బాలురు)లో ఎంపీసీ 40, బైపీసీ 40, హెచ్ఈసీ 40, ఏఅండ్‌టీ 20, భద్రగిరి (బాలికలు)లో ఎంపీసీ 40, బైపీసీ 40, హెచ్ఈసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. • సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మూడు గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. టెన్త్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

మెరిసేవన్నీ పండ్లు కావు

- రసాయనాలతో పండ్లను మగ్గబెడుతున్న వైనం
- ప్రజారోగ్యానికి ప్రమాదం
- పట్టించుకోని యంత్రాంగం

6 లో





చిన్నపిల్లల వార్డులో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

టెస్ట్‌ల కోసం బయటకు పంపిస్తారా?

వైద్యాధికారులపై ఎమ్మెల్యే విజయచంద్ర ఆగ్రహం

బెలగాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వైద్య పరీక్షల కోసం చిన్న పిల్లలను బయటకు ఎలా పంపిస్తారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. మంగళవారం పార్వతీపురం జిల్లాకేంద్ర ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా వార్డుల్లో రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. అనంతరం చిన్నపిల్లలు, డయాలసిస్ వార్డులను సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. చిన్నపిల్లలకు ఏదైనా వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ క్లినిక్‌లకు పంపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇకపై బయటకు పంపించడం మానేయాలన్నారు. ఆసుపత్రిలో ఇటువంటి సమస్యలు పునరావృతమైనా, రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పారమ్మతల్లికి చందనోత్సవం 8 లో
భూసార పరీక్ష.. రైతులకు రక్ష 6 లో
పైడిమాంబకు వైశాఖ మాస పూజలు

నేడు పాలిసెట్

- హాజరుకానున్న 1,677 మంది విద్యార్థులు
- పార్వతీపురంలో ఆరు కేంద్రాలు ఏర్పాటు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగే పరీక్షకు 1,677 మంది హాజరుకానున్నారు. వారి కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరగనుంది. పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 300 మంది, పాలిటెక్నికల్ కాలేజీలో 350 మంది, బెలగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 300 మంది, భాస్కర కాలేజీలో 300 మంది, వేదాంతలో 240మంది, వాసవి కళాశాలలో 187 మంది పరీక్షలు రాయనున్నారు. ఆరుగురు అబ్జర్వర్లను నియమించగా.. విద్యార్థులు అరగంట ముందే కేంద్రానికి హాజరుకావాల్సి ఉంది.

బాలలందరికీ ఆధార్

- మే నెలాఖరుకు మంజూరు చేయాలి
- జాయింట్ కలెక్టర్ శోభిక

పార్వతీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలలందరికీ మే నెలాఖరుకు ఆధార్ కార్డులు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ శోభిక ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 0-6 ఏళ్ల లోపు వయసున్న బాలలు 3,743 మంది ఉన్నారు. వారికి జనన ధ్రువీకరణ పత్రాలు లేనందున ఆధార్‌కార్డులు మంజూరు కాలేదు. తక్షణమే వారికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి. ఇందుకోసం వారి జాబితాను ఆయా మండలాలకు పంపించాం. పాచిపెంటలో 989, కురుపాంలో 434, గుమ్మలక్ష్మీపురంలో 277, మక్కువ, సాలూరు, సీతంపేట తదితర ప్రాంతాల్లో అధికంగా జనన ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంది. సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. పిల్లల జనన వివరాలు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటాయి. వాటి ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పిల్లల గృహాలకు వెళ్లి తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి. ఈ ప్రక్రియ మే 2 నాటికి పూర్తి కావాలి. నిర్దేశించిన సమయానికి ఈ ప్రక్రియ పూర్తయ్యేలా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలి. డిజిటల్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు దరఖాస్తులను నమోదు చేయాలి. మే 18లోగా జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలి. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆధార్ సిబ్బంది ఆయా మండలాల్లో ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహించి బాలలందరికీ ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారు. మే నెలాఖరుకు జిల్లాలోని 3,743 మంది బాలలకు ఆధార్‌కార్డులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలి. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒకటో తేదీ ఉదయానికే లబ్ధిదారులందరికీ అందించాలి. ఇందుకు సబంధించిన నగదును ఏప్రిల్ 30 నాటికి సిద్ధం చేసుకోవాలి. గృహాలు, నీటి పన్ను, రీసర్వే తదితర అంశాలపైనా దృష్టి సారించాలి. ఈ సమావేశంలో పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శోభిక



సుంకిలో గజరాజులు

గరుగుబిల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం సుంకి గ్రామంలో మంగళవారం గజరాజులు హల్‌చల్ చేశాయి. పొలాల్లో సంచరించి స్థానికులను బెంబేలెత్తించాయి. మొక్కజొన్న, అపరాలు, అరటి పంటలను నాశనం చేస్తున్నాయి. కాగా గత రెండు రోజుల పాటు నందివానివలస, గిజబ పరిసర ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు తిరిగి సుంకికి చేరుకోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని కోరుతున్నారు. మరోవైపు అటవీశాఖాధికారులు, ట్రాకర్లు ప్రజలను అప్రమత్తం చేశారు. పంట పొలాల వైపు వెళ్లరాదని రైతులకు సూచించారు.

మెరిసేవన్నీ పండ్లు కావు



- రసాయనాలతో మగ్గబెడుతున్న వైనం
- ప్రజారోగ్యానికి ప్రమాదం
- పట్టించుకోని యంత్రాంగం

విజయనగరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):

● విజయనగరానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి మార్కెట్లో మామిడి పండ్లను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. కిలో పండ్లను రూ.100కు కొనుగోలు చేశాడు. తీరా ఇంటికి తీసుకెళ్లి పండ్లను కోస్తే.. రుచిగా లేవు. అంతేకాదు. కొన్ని గంటల్లోనే నల్లగా మారిపోయాయి. పండ్లన్నిటినీ చెత్త కుప్పలో పోసేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో 'పచ్చని' పండ్ల వెనుక దాగిన మోసానికి ఇది ఓ ఉదాహరణ.

తొలిరోజుల్లో అంతే..

సాధారణంగా సీజన్ ప్రారంభంలో లభించే మామిడి పండ్లు సహజసిద్ధంగా పండినవి కావు. అవి ముమ్మాటికీ రసాయనాలు వేసి పండించినవే. వాటిని తింటే అనారోగ్యం పాలవక తప్పదు. అయినా సరే చాలా మంది కొనుగోలు చేసి మోసపోతుంటారు. మామిడి పండ్లను రసాయనాలతో మగ్గించి... వినియోగదారులకు వ్యాపారులు అంటగడుతున్నారు. ఏటా వేసవిలో మామిడి పంట అందుబాటులోకి వస్తుంది. కానీ మార్చి చివరి వారం నుంచే కొందరు వ్యాపారులు రసాయనాలతో మగ్గబెట్టి... విక్రయిస్తున్నారు. ప్రారంభంలో అరకొరగా ఉత్పత్తి ఉన్నప్పుడే నాలుగు రాళ్లు వేసుకోవాలన్నది వ్యాపారుల ఆలోచన. అందుకే గత నెల రోజులుగా పక్వానికి రాక మునుపే రసాయనాలతో మగ్గబెట్టిన మామిడి పండ్లను విక్రయిస్తున్నారు.

అన్నిటికీ అలాగే..

అత్యంత ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌తో పాటు ఇథలీన్ వంటి రసాయనాలను పండ్లను మగ్గబెట్టేందుకు వినియోగిస్తున్నారు. దీంతో పండ్లలో పోషకాలు తగ్గడమే కాకుండా అవి విషపూరితంగా మారుతున్నాయి. అనారోగ్యానికి కారణమవుతున్నాయి. ప్రధానంగా కాల్షియం కార్బైడ్‌ను వాడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మనిషికి అత్యంత చేటు తెచ్చే రసాయనమిది. ఒక్క మామిడికే కాదు.. అరటి, సపోట, బొప్పాయి, జామ ..ఇలా అన్నింటికీ రసాయనాలనే వాడుతున్నారు. చివరకు కాయలను పక్వానికి తెచ్చేందుకు సూది మందు వాడుతుండడం విచారకరం. జిల్లాలో విజయనగరంతో పాటు బొబ్బిలి, రాజాం, కొత్తవలస, ఎస్.కోటతో పాటు దాదాపు అన్ని మండల కేంద్రాల్లో వీటి విక్రయాలు సాగుతున్నాయి. ప్రత్యేకించి పండ్లను విక్రయించే మార్కెట్లు సైతం ఉన్నాయి. జాతీయ రహదారితో పాటు అంతర్ జిల్లా రహదారుల వెంబడి వీటి విక్రయాలు సాగుతున్నాయి. ప్రతిరోజూ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు వచ్చిన తరువాత అన్ని పట్టణాలకు సరఫరా అవుతున్నాయి. ఎక్కడా సంప్రదాయ పద్ధతితో పండ్ల రకాలను మగ్గించే ప్రయత్నం చేయడం లేదు. రసాయనాలను కృత్రిమంగా వినియోగిస్తున్నారు. ప్రజారోగ్యానికి తీరని భంగం కలిగిస్తున్నారు.

ఆరోగ్యంపై ప్రభావం..

రసాయనాలతో మగ్గించిన పండ్లతో అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. వీటిని తినడం వల్ల కడుపులో వికారం ఏర్పడుతుంది. వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడతారు.

- రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలు వస్తాయి.
- కాళ్లలో సూదులు గుచ్చుతున్నట్టు, అరచేతిలో, అరకాళ్లలో చర్మ వ్యాధులు సంభవిస్తాయి.
- తలనొప్పి, అలసట, నరాల సమస్యలు తలెత్తుతాయి.
- ఊపిరితిత్తులు, మూత్రాశయ వ్యాధులు సంక్రమిస్తాయి.
- మూత్రపిండాలు దెబ్బతినడమే కాకుండా కేన్సర్ వచ్చే అవకాశం ఉంది.
- మానసిక వ్యాధులు కూడా సంక్రమిస్తాయి.
- కనురెప్పల వాపు తదితర కంటి సమస్యలు వస్తాయి.

కృత్రిమంగా మగ్గబెట్టడానికి..

జిల్లాలో పండ్లను మగ్గబెట్టిన కేంద్రాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా మామిడి సాగవుతోంది. కృత్రిమంగా మగ్గబెట్టే ప్రాంతాల్లో రోజుల తరబడి పండ్లను నిల్వ ఉంచుతారు. డిమాండ్‌ను బట్టి మగ్గబెట్టి సరఫరా చేస్తారు. సాధారణ రోజుల్లో నిత్యం 50 టన్నుల వరకూ అరటిపండ్లు, పది టన్నుల వరకూ యపిల్ పండ్లు, కమలా, మూడున్నర టన్నుల వరకూ సపోట, జామ, ఇతరత్రా పండ్లు వినియోగిస్తున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. వేసవిలో మాత్రం దాదాపు 45 రోజుల పాటు సగటున 100 టన్నుల మామిడిని వినియోగిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

పండ్లను కొనుగోలు చేసేటప్పుడు అవగాహన తప్పనిసరి. పండ్లపై మచ్చలు సరిపోల్చుకోవాలి. పొడితనం ఉంటే గమనించాలి. తెలియక కొన్న పండ్లను కాసేపు వేడినీటిలో ఉంచాలి. పైనపు పూతలా ఉంటే వెంటనే తొక్కను తీసి గమనించాలి.

అనారోగ్యం కొని తెచ్చుకున్నట్టే..

అజాగ్రత్తతో వ్యవహరించి పండ్లను కొనుగోలుచేస్తే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్టే. రసాయనాలతో మగ్గించిన పండ్ల ప్రభావం ఆరోగ్యంపై ఎక్కువగా ఉంటుంది. శరీరంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గుతాయి. ప్రధాన అవయవాలపై పెను ప్రభావం పడుతుంది. అందుకే తాజా పండ్లను ఎక్కువగా తీసుకోవాలి.

-డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయనగరం

అశోక్‌ను కలిసిన డీసీసీబీ చైర్మన్ నాగార్జున

విజయనగరం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా నియమితులైన కిమిడి నాగార్జున మంగళవారం పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజులను కలిశారు. ఈ సందర్భంగా అశోక్, అదితి గజపతిరాజులు ఆయనను అభినందించారు.



అశోక్, అదితి గజపతిరాజులతో డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున

పైడిమాంబకు వైశాఖ మాస పూజలు

● పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తులు



పైడితల్లిని దర్శించుకుంటున్న భక్తులు



వివిధ రకాల పువ్వులతో పైడిమాంబను అలంకరించిన దృశ్యం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైశాఖ మాసం వివిధ గ్రామ దేవతలకు ప్రీతిపాత్రమైనది. నెల రోజుల పాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. మూడులాంతర్లు వద్ద ఉన్న పైడిమాంబ చదురుగుడి, రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడుల్లో మంగళవారం వైశాఖ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6.45 గంటలకు భక్తులకు దర్శనాన్ని కల్పించారు. అంతకముందు పైడిమాంబకు జలాభిషేకం, పాలాభిషేకం చేశారు. వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా ఆలంకరించారు. వైశాఖ మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబ దర్శనానికి వచ్చారు. మామిడి పండ్లను పైడిమాంబకు ప్రత్యేక నైవేద్యంగా సమర్పించారు. వనంగుడి, చదురుగుడుల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 వరకూ పైడిమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. మామిడి పండ్లతో పాటు, వివిధ రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. ఈ నెల 29 నుంచి మే 29 వరకూ ప్రతి మంగళ, గురు వారాల్లో పైడిమాంబకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. మే నెల 13న పైడిమాంబ దేవర ఉత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవదాయ శాఖ చేస్తోంది. మంగళవారం సాయంత్రం ఆలయం ఎదుట ఉన్న వేదిక వద్ద పార్కు గేటు సమీపంలో గరిడీ, పులివేషాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. సిరివిల్లి దివిజ, మధు, జ్యోత్స్న, దాక్షాయణి, జై శ్రీ, కుందన్, జయకృష్ణ, నిఖిల్ కళా ప్రదర్శన నిర్వహించారు.

ఘోషాసుపత్రి సిబ్బందికి ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఘోషాసుపత్రి పీపీటీసీటీ సిబ్బందికి సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. హెచ్ఐవీ బాధితులకు నిరంతరం అందిస్తున్న సేవలను గుర్తించి నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రాష్ట్రంలోని కొన్ని ఆసుపత్రులకు ఈ సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపిక చేసింది. ఇందులో భాగంగానే ఘోషాసుపత్రి పీపీటీసీటీ సిబ్బందికి ఈ అవార్డును అందజేశారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కె.రాణి, పీపీటీసీటీ కౌన్సిలర్లు టి.పద్మావతి, టి.గోపాలరావు, ల్యాబ్ టెక్నీషియన్ గౌరీ శంకర్‌లు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడులు సిబ్బందిని అభినందించారు.

భూసార పరీక్ష.. రైతులకు రక్ష

- నివేదికను అనుసరిస్తే మంచి ఫలితాలు
- పెట్టుబడులు తగ్గుముఖం.. అధిక దిగుబడులు సొంతం

విజయనగరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులు సాధించాలన్న తపనతో రైతులు పరిమితికి మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. ఈ కారణంగా భూమి సారం కోల్పోయి... పంటలు సరిగా పండక... దిగు బడులు తగ్గుతున్నాయి. దీంతో పెట్టుబడులు కూడా చేతికి అంద క రైతులు నష్టపోతున్నారు. అంతేగాక ప్రకృతి వరప్రసాదంగా ఉన్న పోషకాలు సైతం మొక్కలకు అందకపోవడం గమనార్హం. భూమిలో కొంత పరిమాణంలో సహజ సిద్ధంగా లవణ పరిమాణం, నత్రజని, పొటాష్ వంటి పోషకాలు ఉంటాయి. అవి ఎంతమేర మొక్కలకు లభ్యమవుతున్నాయో... వేయబోతున్న పంటకు అవి ఎంత మేర అవసరమో రైతులు నిర్ధారించుకున్నాకే ఎరువులు వినియోగించాలి. భూసార పరీక్షలు చేయిస్తేనే ఆ సమాచారం తెలుస్తుంది. అలా చేయకపోవడం వల్ల ఇ ష్టారాజ్యంగా ఎరువులు వేయడం వల్ల పెట్టుబడి పెరగడమే కాకుండా భూమిలో సారం క్రమేపీ తగ్గి.. చౌడు భూమిగా తయారయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఏడాది జిల్లాలో 36,250 భూసార పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. మే 25న క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమునాలను సేకరించి భూసార కేంద్రాలకు పంపాలి. భూసార కేంద్రాలలో ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి... ఖరీఫ్ ప్రారంభంలోగా రైతులకు సమాచారం అందించాలని ఆదేశించారు.

● సేకరణ ఇలా..

పొలంలో 10 నుంచి 12 చోట్ల మట్టిని సేకరించి.. ఆ ప్రాంతాల్లో త్రిభూజాకారంలో 6 నుంచి 8 అంగుళాల మేర గుంత తవ్వాలి. పై పొర నుంచి కింద వరకు ఒకే మందంలో పలుచని పొర వచ్చేలా మట్టిని తీయాలి. ఈ మట్టిని సేకరించి గోనె సంచి మీద వేసి... నాలుగు భాగాలుగా విభజించాలి. ఎదురెదురుగా ఉన్న మట్టిని రెండు భాగాలుగా కలపాలి. ఇలా చేసి సుమారు అర కిలో మట్టి మిగిలేలా చేయాలి. సేకరించిన మట్టి నమునాను ఒక కవర్‌లో వేసి వ్యవసాయ శాఖ అధికారులకు అందజేస్తే భూసార పరీక్షలను నిర్వహించి ఫలితాలను అందజేస్తారు. మట్టి నమునాలో గ్రేడు విధానం అవలంబించడం వల్ల చుట్టు పక్కల సరాసరి పది మంది రైతుల భూసారం కూడా తెలుసుకునేందుగా వీలు కలుగుతుంది.

● రైతులు ఇవ్వాల్సిన సమాచారం..

మట్టి నమునా తీయించాలకున్న రైతు తన పేరు, ఆధార్ కార్డు, గ్రామం, పొలం సర్వే నెంబర్, సాగు పంటల స్థితి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలి. వారు పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి పొలాల్లో ఏఏ ధాతువుల లోపం ఉందనే విషయమై సమగ్ర నివేదికను అందజేస్తారు. లోపం ఉన్న ఎరువులను ఎంతెంత మోతాదులో వేయాలో ఈ నివేదిక ఉంటుంది కాబట్టి రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడులను సాధించవచ్చును.

లాభాలు ఇవే..

- సాగు చేసే భూమిలో ఏ ధాతువు గుణాలు తక్కువగా ఉన్నాయో.. ఏవి ఎక్కువగా ఉన్నాయో తెలుస్తుంది.
- భూసార పరీక్ష నివేదికను అనుసరించి మూడేళ్ల పాటు సేద్యం చేయవచ్చు.
- ప్రభుత్వం రాయితీపై అందజేసే జింక్, జిప్సం, విత్తనాలు తదితర వాటికి నమూనాలు చేయించుకున్న రైతులకు ప్రాధాన్యం ఇస్తారు.
- భూసార పరీక్షలు చేయించుకున్న రైతుకు ఏ సమయంలో ఏ ఎరువులు వేయాలనే విషయాన్ని కిసాన్ సెంటర్ నుంచి ఆ సమయాల్లో వాయిస్ కాల్ వస్తుంది. అలాగే ఎప్పటికప్పుడు సంక్షిప్త సమాచారాన్ని రైతులకు అందజేస్తుంటారు.

పరీక్షలు ఎందుకంటే..

పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి.... ఎంత మోతాదులో ఎరువులు, రసాయన మందులు వాడాలో తెలుసుకోవడమే భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశం. భూసార పరీక్షలు చేయించి వాటిని ఆచరించడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయి. పంటలో స్థిర మైన దిగుబడులు... నాణ్యమైన ఉత్పత్తి సాధించవచ్చు. అధిక దిగుబడులు పొందాలన్న ఆలోచనతో రైతులు అనవసరంగా ఎక్కువ స్థాయిలో ఎరువులు వాడటం ద్వారా నాణ్యమైన దిగుబడులు రాకపోగా.. చీడపీడల ఉధృతి... వాతావరణ కాలుష్యం తదితర సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి వాటిని అధిగమించడానికి నేలకు సంబంధించిన స్థితిగతులను తప్పనిసరిగా తెలుకోవాలి.



మట్టి నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

క్రిమి సంహారక మందులు అవసరం లేదు..

గత ఏడాది 20,200 భూసార పరీక్షలు చేశాం. ఈ ఏడాదికి 28వేలు చేయాలనుకుంటున్నాం. ఏటా వివిధ ప్రాంతాల నుంచి మట్టి నమునాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. పరీక్షల ద్వారా మట్టిలో ఎటువంటి పోషక విలువలు ఉన్నాయో తెలుస్తుంది. నత్రజని, భాస్వరం, పొటాస్, సేంద్రియ కర్బనం, సూక్ష్మపోషకాల స్థాయి తెలుస్తుంది. మట్టి పరీక్షల ఫలితాలను బట్టి రైతు తన భూమిలో ఏ పంటలు వేసుకోవాలి.. దిగుబడి కోసం ఎలాంటి సంరక్షణ చర్యలు తీసుకోవాలో తెలుస్తుంది. ఈ విషయాలన్నీ వ్యవసాయ అధికారులు చెబుతారు. వేసవిలో పచ్చిరొట్ట ఎరువులు వేయడం మంచిది. ఈ ఏడాది 60వేల నవధాన్యాల కిట్లు, ఆర్గానిక్ నవధాన్యాల కిట్‌లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచాం. అనవసరంగా క్రిమిసంహారక మందులు, ఎరువులు వాడొద్దు. వ్యవసాయ అధికారులతో సూచనలతో రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకుంటే పంట కూడా ఆరోగ్యంగా పెరుగుతుంది.

-వై.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

పీజీఆర్ఎస్ వినతులపై ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ అంబేడ్కర్ ● నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల కార్యాలయాలకు జిల్లా నుంచి అందిన దరఖాస్తులపై కలెక్టర్ తన కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. మొత్తం 10 వినతులను ఈ పరిశీలించారు. ఫిర్యాదుదారులను తమ చాంబర్‌కు పిలిపించి... వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వద్దనున్న సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఆ ఫిర్యాదులకు సంబంధించి రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ మురళి, డ్వామా పీడీ శారదాదేవి, డీసీవో రమేష్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ ఆశయ్య, ఆర్‌డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

32 బాలల సంరక్షణ కేంద్రాలకు ప్రతిపాదనలు

జిల్లాలో 32 బాలల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వీటిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 5, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 27 ఏర్పాటు చేసుకొనేందుకు ప్రభుత్వానికి దరఖాస్తులు అందాయి. జువైనల్ జస్టిస్ యాక్ట్ -2015 ప్రకారం వీటిని ఏర్పాటు చేసేందుకు డీపీవో కన్వీనర్‌గా ఉన్న ఇన్‌స్పెక్షన్ కమిటీ సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ మంగళవారం పరిశీలించింది. నిబంధనల ప్రకారం అన్నీ సక్రమంగా ఉన్నాయో? లేదో అక్కడక్కడా తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలని..ఆ తరువాతే ఆమోదిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ఈ సమావేశంలో బాలల సంరక్షణ కమిటీ జిల్లా చైర్మన్ గోటేటి హిమబిందు, ఏఎస్పీ సౌమ్యలత, ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం, డీసీపీయూ లక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల ఉత్సవాలు

తెర్లాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందిగాం, ఉద్దవోలు గ్రామదేవతల ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. 16 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయా గ్రామాల్లో మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో సిరిమానోత్సవం నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఉద్దవోలులో సిరిమానోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నిరుపయోగంగా మార్కెట్

●షాపులు కేటాయించినా ఆరుబయటే వ్యాపారాలు ●గజపతినగరం పంచాయతీలో ఇదీ పరిస్థితి

గజపతినగరం ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం పంచాయతీలో నిర్మించిన కూరగాయల మార్కెట్ వినియోగానికి దూరంగా ఉంది. మార్కెట్‌లోకి వెళ్లేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. మార్కెట్ నిర్మాణం చేపట్టి ఐదు నెలలు కావస్తున్నా దాన్ని వినియోగించడంలేదు. ఎండలోనే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఎన్నో ఏళ్లనుంచి ఒకేచోట వ్యాపారం సాగిస్తున్నామని, ఇప్పుడు చోటు మారితే వ్యాపారాలు సాగే పరిస్థితి ఉండదని పలువురు అంటున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రూ.15 లక్షలు నాబార్డు నిధులు, రూ.5 లక్షలు పంచాయతీ నిధులు వెచ్చించి 32 షాపులతో కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టారు. జనవరి 11న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మార్కెట్‌ను ప్రారంభించారు. కూరగాయల మార్కెట్‌లో 26 షాపులను లాటరీ పద్ధతిలో చిరు వ్యాపారులకు కేటాయించారు. అయినప్పటికీ చిరువ్యాపారులు మార్కెట్‌లోకి వెళ్లడంలేదు. వాస్తవంగా ఇప్పుడు వ్యాపారాలు సాగిస్తున్న చోటుకు అనుకుని కొత్తగా మార్కెట్ నిర్మాణం చేపట్టారు. అయినప్పటికీ పంచాయతీ స్థలంలో ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన షెడ్లల్లో, ఆరుబయట వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇప్పుడు కొనసాగుతున్న ప్రదేశంలో రోజువారీ ఆశీలు కడితే సరిపోతుందని, అదే మార్కెట్‌లో వ్యాపారం చేస్తే అద్దెలు చెల్లించాల్సి ఉంటుందనే భావన వారిలో ఉంది. అందుకే చిరువ్యాపారులు మార్కెట్‌లోకి వెళ్లడం లేదని తెలుస్తోంది.


ఆరుబయటే వ్యాపారాలు సాగిస్తున్న దృశ్యం


కొత్తగా నిర్మించిన కూరగాయల మార్కెట్ ఇదే..

కేటాయించిన షాపులకు వెళ్లాల్సిందే..

కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులకు కేటాయించిన షాపులకు వారు వెళ్లాల్సిందే. లేకుంటే షాపులను రద్దు చేస్తాం. అలాగే పంచాయితీ స్థలంలో వ్యాపారాలు చేసేందుకు అనుమతి నిరాకరిస్తాం.

-జి.జనార్దనరావు, ఈవో, గజపతినగరం

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

కురుపాం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కురుపాం మండలంలో మంగళవారం వేర్వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. మొండెంఖల్ గ్రామ సమీపంలోని దొంతికొండల వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో విజయ్, జీవన్, రాజు, సింగ అనే నలుగురు గాయపడ్డారు. వీరిని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. అలాగే కురుపాం సమీపంలోని మూలిగూడ జంక్షన్‌లో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులకు కురుపాం ఆసుపత్రిలో చికిత్స అందించారు. మొండెంఖల్ ఘటనపై నీలకంఠాపురం, మూలిగూడ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్వాధీనం

సీతంపేట రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో మండ గ్రామంలో ఎక్సైజ్ శాఖ చేపట్టిన దాడుల్లో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఏఈఎస్ శ్రీరంగండొర తెలిపారు. మంగళవారం తమ సిబ్బందితో చేసిన దాడుల్లో సారాతో పాటు తయారీకి ఉపయోగించే 1300 లీటర్ల బెల్లం ఊటలను గుర్తించి ధ్వంసం చేసినట్టు చెప్పారు. పరారీలో ఉన్న నిందితులతో పాటు బెల్లం విక్రయించిన జామి సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ సూర్యకుమారి తెలిపారు. దాడుల్లో బీఎంపీపీ ఇన్‌స్పెక్టర్ మురళీ, రాజాం ఎస్ఐ మహేష్, సీతంపేట ఏఎస్ఐ సంజీవరావు పాల్గొన్నారు.

●మండలంలో చినబగ్గ సమీపంలో సీతంపేట ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు చేసిన దాడుల్లో 720 లీటర్ల బెల్లంఊటలను గుర్తించి ధ్వంసం చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఊటల తయారీకి వినియోగించే ప్లాస్టిక్ డ్రమ్ములను నాశనం చేశామని చెప్పారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

రాజాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులకు బుధవారం తాగునీటి సరపరా నిలిపివేస్తున్నట్టు కమిషనర్ రామప్పలనాయుడు, ఏఈ పొన్నాడ వెంకటరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా పాలకొండ రోడ్డులోప్రధాన పైపులైన్ మార్పు చేస్తున్న కారణంగా పంపింగ్ నిలుపుదల చేయనున్నామన్నారు.

'మన మిత్ర'పై అవగాహన కల్పించండి

రాజాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మన మిత్ర వాట్సాప్‌పై డోర్ టూ డోర్ ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని అంతికాపల్లిలో సచివాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బంది ప్రతీ రోజు విధులకు సమయానికి హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలను తెలియ జేయాలన్నారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్‌కు రూ.10 వేల జరిమానా

గజపతినగరం ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడొంపులగెడ్డ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. రూ.10 వేలు జరిమానాను తహసీల్దార్ బి.రత్నకుమార్ విధించారు. శ్రీరంగరాజపురానికి చెందిన యిజ్జిరోతు సత్యమప్పలనాయుడుకు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

నెల్లిమర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సతివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఒమ్మి, రామతీర్థం, రూరల్ ఫీడర్‌ల పరిధిలో లైన్ల నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాల్లో సరఫరా నిలిపేస్తామన్నారు.

కిశోర బాలికలకు శిక్షణ

గంట్యాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెదమజ్జిపాలెంలో మంగళవారం ఐసీడీఎస్ పీవో ఉమామహేశ్వరి కిశోర బాలికలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో 11 నుంచి 14 ఏళ్లలోపు, 15 నుంచి 18 ఏళ్లలోపు వారిని రెండు గ్రూపులుగా విభజించారు. రోజుకో అంశంపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ ఉన్నారు.

మూకుమ్మడిగా కౌన్సిలర్ల గైర్హాజరు

●నగర పంచాయతీ చైర్‌పర్సన్ కూడా..
● సమావేశం వాయిదా వేసిన కమిషనర్

నెల్లిమర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించాల్సిన కౌన్సిల్ అనూహ్యం గా వాయిదా పడింది. చైర్‌పర్సన్ బంగారు సరోజినితో పాటు ఇటు టీడీపీ, అటు వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ఎ.తారక్‌నాథ్ ప్రకటించారు. ఈ సమావేశానికి వైసీపీ నుంచి జనసేనకు వెళ్లిన కౌన్సిలర్ జనా సంధ్యారాణి, వైసీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మాత్రమే హాజరయ్యారు. ఇటీవల జరిగిన సన్నాహక సమావేశంలో చర్చించనున్న అజెండా అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అందరూ గైర్హాజరు అయినట్టు తెలుస్తోంది. టీడీపీకి చెందిన కౌన్సిల్ సభ్యులను చైర్‌పర్సన్ కనీస స్థాయిలో కూడా గౌరవించడం లేదని మదనపడుతున్నట్లు సమాచారం. అయితే వైసీపీ కౌన్సిలర్లు కూడా మూకుమ్మడిగా గైర్హాజరు అవడం వెనుక ఆంతర్యమేమిటన్నది తెలియలేదు. ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. తిరిగి సమావేశం ఎప్పుడు జరుగుతుందనే విషయాన్ని తర్వాత తెలియజేస్తామని కమిషనర్ తెలిపారు.


కౌన్సిల్‌కు హాజరైన ఇద్దరు కౌన్సిలర్లు

కరాటేలో సత్తా చాటిన క్రీడాకారులు

శృంగవరపుకోట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో శృంగవరపుకోటకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ప్రతిభ చాటారని కోచ్, బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 25 నుంచి 27 వరకు మలేషియాలో నిర్వహించిన ఈ పోటీల్లో 13 ఏళ్ల కేటగిరిలో వి.హార్థిక్ వినయ్ బ్రాంజ్ పతకం, 10 ఏళ్ల లోపు కేటగిరిలో బి.వినయ్ బంగారు పతకం పొందారన్నారు. ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ కరాటే జనరల్ సెక్రటరీ కొండ్రు కీర్తన్, అసోసియేషన్ సెక్రటరీ, ప్రపంచ కరాటే ఫెడరేషన్ జడ్జి నరేంద్ర దుర్గాప్రవీణ్ విజేతలకు పతకాలను ప్రదానం చేశారన్నారు.


కోచ్‌తో హార్థిక్ వినయ్, బి.వినయ్

ఉత్తమ విద్యార్థులకు అభినందనలు

గజపతినగరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని జిన్నాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను మంగళవారం డిప్యూటీ డీఈవో మోహనరావు అభినందించారు.. 560 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. అలాగే 591 మార్కులు సాధించి నియోజకవర్గంలో ప్రథమస్థానం, జిల్లాలో తృతీయ స్థానం సాధించిన పైల యశోదను ఆయన అభినందించారు.



సత్కరిస్తున్న డిప్యూటీ డీఈవో

రక్తదాన శిబిరాలు నిర్వహించండి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రక్తదాన శిబిరాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పిలుపునిచ్చారు. మంగళవారం మాతృభూమి సేవాసంఘం, ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో యూత్ హాస్టల్‌లో ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తేలుగంటి సురేష్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటైంది. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సుధాకర్, మన్యాల శ్రీనివాస్ యాదవ్, అంజిబాబు, పొంద్రంకి సంతోష్, అశ్విని, బూర్లె పైడినాయుడు, కూర్మారావు, కాంచన, ప్రవళ్లిక, జగదీశ్, బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కళాకు పలువురి పరామర్శ

రాజాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నేత్ర శస్త్రచికిత్స చేయించుకున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును మంగళవారం పలువురు నాయకులు ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కళాను పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, శాసపు రమేశ్‌కుమార్, దుప్పలపూడి నాగేశ్వరరావు, టంకాల వెంకటేశ్, బొత్స వెంకటనాయుడు, అల్తి సత్యనారాయణ తదితరులున్నారు.


కళాను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

రాజాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్యకర్త సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఆదుకోవడానికి పార్టీ సిద్ధంగా ఉందన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.100 సభ్యత్వం పొందిన కార్యకర్త ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల ప్రమాద బీమా దేశంలో ఎక్కడా లేదన్నారు. కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటకు చెందిన టీడీపీ కార్యకర్త గుడివాడ ఉత్తరకుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మంగళవారం ఆయన నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అలాగే లచ్చయ్యపేటకు చెందిన పిచ్చిక శ్రీను అనారోగ్యానికి గురైన నేపథ్యంలో రూ 2.46 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. సంతకవిటి మండలం బూరాడపేటకు చెందిన బగాది లోకనాథం రైలు నుంచి జారిపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన కుమారుడు బడాది రవితేజకు రూ.4.89 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కోండ్రు జగదీశ్, బొత్స వాసుదేవరావు నాయుడు, గురవాన నారాయణరావు, శాసపు రమేశ్‌కుమార్, దుప్పలపూడి శ్రీనివాసరావు తదతరులున్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

రమణకు పరామర్శ

గరివిడి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడూరుకు చెందిన టీడీపీ కార్యకర్త మీసాల రమణ భార్య పుష్ప ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు మంగళవారం పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలు తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీడీపీ నేతలు పైల బలరాం, ఎస్.సురేష్‌కుమార్, అడపా సూర్యనారాయణ, ఎలకల వెంకునాయుడు తదితరులున్నారు.


పరామర్శిస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు

చట్టాలపై అవగాహన పెంచుకోండి

రాజాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పట్టణ సీఐ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అంతికాపల్లిలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి తగాదాలు జరిగినా గ్రామపెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బు, సమయం వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఆర్ఐ సాగర్, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జోనల్ కార్యదర్శిగా చిరంజీవి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ కార్యవర్గ ఎన్నికలను మంగళవారం విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యదర్శిగా గెడ్డె చిరంజీవిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సంఘ జోనల్ న్యాయ సలహాదారులుగా కె.పి.దేశాయ్, జోనల్ గౌరవ అధ్యక్షుడిగా ఎం.తిరుపతిరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జోనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, ఆరు జిల్లాల గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.


చిరంజీవిని అభినందిస్తున్న గ్రామీణ వైద్యులు

చక్కెర పరిశ్రమతోనే రైతుల భవిష్యత్

● సాగు విస్తీర్ణం పెంచాలని, రాయితీలు ఇవ్వాలని యాజమాన్యానికి సూచన
●ఉంగరాడమెట్టలో రైతుల అత్యవసర సమావేశం

రేగిడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం పదికాలల పాటు కొనసాగాలని, ఈ ప్రాంత రైతులకు ఇది సంజీవిని అని నియోజకవర్గంలోని చెరుకు రైతులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబు, నియోజకవర్గ వైసీపీ నేత తలే రాజేశ్‌తో పాటు వివిధ పార్టీ నేతలు పునరుద్ఘాటించారు. కర్మాగారాన్ని మూసేస్తారని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో స్థానిక చెరుకు రైతులు మంగళవారం ఉంగరాడమెట్ట వద్ద అత్యవసర సమావేశం నిర్వహించారు. చెరకు రైతుసంఘం ప్రతినిధి కింజరాపు సురేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు, రాజాం, రేగిడి పాలకొండ, వంగర మండలాలకు చెందిన రైతులు హాజరై మట్లాడారు. మూడేళ్లుగా చెరుకు సాగు తగ్గుతున్న నేపథ్యంలో యాజమాన్యం చెరుకు సాగుపై దృష్టిలో పెట్టాలన్నారు. గతంలో కొనసాగించిన రాయితీలు ఇవ్వాలని పలువురు రైతులు యాజమాన్యానికి సూచించారు. చక్కెర పరిశ్రమతో ఈ ప్రాంత రైతుల భవిష్యత్ ముడిపడి ఉందన్నారు. అవసరమైతే పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఇందుకు జేఏసీ ఏర్పాటుకు ఆలోచన చేశారు. సమావేశంలో రాజాం జడ్పీటీసీ సభ్యుడు చీడి నర్సింహులు, రాజాగోపాల రావు, పాలకొండ మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు చింతు సంగంనాయుడు, నీటిసంఘం అధ్యక్షుడు కిమిడి సూరపనాయుడు, పప్పల వెంకట అప్పలనాయుడు, జనార్దనరావు తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లిమర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల గాంధీనగర్ కాలనీకి చెందిన బి.సూర్యనారాయణ (46) రైలు ఢీకొని మంగళవారం మృతి చెందారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని హౌరా-చెన్నై రైలు మార్గంలో ప్రమాదం జరిగింది. మృతుడు సూర్యనారాయణకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆమదాలవలస రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

గజపతినగరం, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన చోటు చేసుకుంది. బొబ్బిలి నుంచి విజయనగరం వైపు మొక్కజొన్న లోడ్‌తో వెళుతున్న వ్యాన్ ప్రమాదానికి గురైంది. దాంతో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వ్యాన్‌ను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. గొడ్డె శివ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు కేసు నమోదు చేశారు.


బోల్తా పడిన వ్యాన్

గుండెపోటుతో కొర్లవలస హెచ్ఎం మృతి

రేగిడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొర్లవలస ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఈశర్ల రామారావు గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం పొందూరు మండలం వాండ్రంకి. రాజాం పట్టణంలోని మారుతీనగర్‌లో ఆయన నివాసం ఉంటున్నారు. అస్వస్థతకు గురైన ఆయన్ని కుటుంబ సభ్యులు రాజాంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు పిల్లలున్నారు. రామారావు మృతిపై సహచర ఉపాధ్యాయులు, ఎంఈవోలు వరప్రసాదరావు, ఎరకయ్య సంతాపం తెలిపారు.


రామారావు (ఫైల్)

మేడేను జయప్రదం చేయండి

నెల్లిమర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికదినం మేడేను కార్మికులు జయప్రదం చేయాలని జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. మిల్లు ప్రధాన గేటు వద్ద ఆ యన మంగళవారం కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కార్మికులు 8 గంటల పని సమయం, హక్కుల సాధన కోసం చికాగో నగరంలో కార్మికులు ఉద్యమించి ప్రాణత్యాగం చేశారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ మే 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని రామారావు కోరారు.


మాట్లాడుతున్న రామారావు

సీజ్ చేసిన గంజాయి తనిఖీ

శృంగవరపుకోట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో గంజాయి నిల్వను డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.వి.ఎన్.బాబ్జీరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక స్టేషన్ పరిధిలోని నాలుగు గంజాయి కేసుల్లో 807 కేజీల గంజాయి పట్టుబడిందని సీఐ సీహెచ్.రాజేష్ తెలిపారు. గంజాయిని తనిఖీ చేసిన అధికారులు దాన్ని ధ్వంసం చేసేందుకు ఆదేశాలు ఇచ్చారు. గంజాయి రవాణా, సారా అమ్మకాలు, మద్యం అక్రమ విక్రయాలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.


సీఐకి సూచనలు ఇస్తున్న అధికారులు

చెరువు పూడ్చివేతపై ఫిర్యాదు

వేపాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరిగిపాలెం రెవెన్యూలోని సర్వే నెంబరు 70/66లో గల చిన్నపాటి చెరువును కొందరు వ్యక్తుల పూడ్చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన రైతులు నెలిపూడి రామలక్ష్మి, మూనూరి అవతారం తదితరులు తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. దాంతో ఆయన స్పందించారు. తక్షణమే ఆర్ఐ, వీఆర్వోలను పంపించి విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.

రెండోరోజూ గిరిజనుల ఆందోళన

●తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ

వేపాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మారిక గ్రామంలో అదానీ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టవద్దని గిరిజనులు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట చేపడుతున్న ఆందోళన మంగళవారం రెండోరోజుకు చేరింది. సీపీఎం జిల్లా నేత చల్లా జగన్ సారథ్యంలో జరుగుతున్న ఆందోళనలో గిరిజనులు పిల్లాపాపలతో పాల్గొన్నారు. పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడారు. గిరిజనుల ఆందోళన నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు సూచనల మేరకు వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్, ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెచ్‌సీ శేషాద్రినాయుడులతో పాటు పలువురు పోలీసులు, ఎస్టీఎఫ్ బృందాలతో పహరా కాశారు. సోమవారం ఆందోళన అనంతరం పురుషులు తహసీల్దార్ కార్యాలయంలో, మహిళలు ప్రైవేట్ షెల్టరుకు వెళ్లారు. తిరిగివారు మంగళవారం ఆందోళనకు కొనసాగించేందుకు రావడంతో వారిని ఎస్టీఎఫ్ బృందాలు అడ్డుకున్నాయి. దాంతో వారు మండల పరిషత్ కార్యాలయ ప్రధాన గేటు వద్ద మండుటెండలో బైఠాయించారు. విషయాన్ని గమనించిన ఎస్.కోట రూరల్ సీఐ.. వారిని లోపలకు అనుమతించాలని సూచించడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కొనసాగించారు. గిరిజనుల ఆందోళనలో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు దాసరి వెంకన్న పాల్గొన్నారు.

●ప్రస్తుతం పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి నోటిఫికేషన్ మాత్రమే వచ్చిందని, తదుపరి ఉత్తర్వులు రానందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గిరిజనులకు తహసీల్దార్ జె.రాములమ్మ నచ్చజెప్పారు. ఒకవేళ ఆదేశాలు వస్తే మీకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇవ్వడంతో గిరిజనులు, గిరిజన నాయకులు ఆందోళన విరమించారు.


ఆందోళన చేపడుతున్న గిరిజనులు

కోనూరులో సరుగుడు తోట దగ్ధం

గరివిడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరులో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన కె.ఆదినారాయణకు చెందిన 10 ఎకరాల సరుగుడు తోట దగ్ధమైంది. మోటారు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.


దగ్ధమవుతున్న తోట

అక్రమాలకు చెక్!

(5వ పేజీ తరువాయి)

22 వాయిదాలు చెల్లించాల్సి ఉంది. 23వ వాయిదా రూ.1500 , 24వ వాయిదా రూ.1600 చొప్పున తిరిగి చెల్లించుకోవచ్చు. కానీ 24 వాయిదాలను కూడా రూ.2,500 చొప్పున సభ్యుల నుంచి వసూలు చేస్తున్నారు. దీంతో సభ్యులు సుమారు రూ.1700 నష్టపోతున్నారు. భవిష్యత్‌లో ఇటు వంటి పరిస్థితి తలెత్తకుండా.. యాప్ ద్వారా సక్రమంగా రుణ వాయిదాలను చెల్లించే విధంగా డీఆర్‌డీఏ ప్రత్యేక చర్యలు ప్రారంభించింది.

రికవరీ ఎప్పుడు?

● పాచిపెంట మండలం తుమరవల్లి , పోలమాంబ విలేజ్ ఆర్గనైజేషన్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. సభ్యులు రుణాలు తీసుకున్న ప్రాప్తికి తిరిగి వాయిదాలను చెల్లించినప్పటికీ అవి స్త్రీనిధి ఖాతాలోకి జమకాలేదు. సభ్యులు చెల్లించిన వాయిదా సొమ్ములు స్వాహా అయ్యాయి. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో విచారణలు చేపట్టారు. సుమారు 4.7 లక్షలను బాధ్యుల నుంచి రికవరీ చేయాలని తేల్చారు. అయితే ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు రికవరీ జరగలేదు.

● పార్వతీపురం మండలం బాలగొడబ గ్రామంలో నేతాజీ విలేజ్ ఆర్గనేజేషన్ నుంచి సుమారు రూ.ఐదు లక్షలు రికవరీ చేయాల్సి ఉంది. సభ్యులు రుణ వాయిదాలు తిరిగి చెల్లించినప్పటికీ స్త్రీనిధి ఖాతాల్లోకి అవి జమ కాలేదు. కాగా పక్కదారి పట్టిన రూ.ఐదు లక్షలు ఇంకా రికవరీ కాలేదు. ఈ విధంగా జిల్లాలో చాలాచాట్లో స్త్రీనిధి రుణాల వసూళ్లలో అవకతవకలు జరు గుతున్నా.. సకాలంలో చర్యలు తీసుకోవడం లేదు. దీంతో సభ్యులు పేరిట రుణాలు కొనసాగుతున్నాయి.

చెల్లించకపోతే చర్యలు

స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు తిరిగి వాయిదాలను చెల్లిస్తున్నప్పటికీ కొన్ని వీవోల వద్ద జరిగిన అక్రమాలపై ఫిర్యాదులొచ్చాయి. దీనిపై విచారణలు కూడా పూర్తయ్యాయి. పాచిపెంట మండలంలో సుమారు రూ.4 లక్షలు, పార్వతీపురం మండలంలో రూ.ఐదు లక్షలను రికవరీ చేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం బాధ్యులు చెల్లించకపోతే కఠిన చర్యలు తప్పవు. యాప్‌ల ద్వారా రుణ వాయిదాలు చెల్లించే ప్రక్రియ ప్రారంభించాం.

- కె.హేమలత, స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్, పార్వతీపురం

సిగ్నల్స్ లేక.. సేవలు అందక!

(5వ పేజీ తరువాయి)

ఈకేవైసీ వంటి ఎన్నో రకాల సేవలు అందాల్సి ఉంది. కానీ ఫైబర్ నెట్ పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సేవలందేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

దారుణంగా ఉంది

ఏజెన్సీ ప్రాంతంలో సిగ్నల్స్ పరిస్థితి దారుణంగా ఉంది. నెట్ సిగ్నల్ లేక తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వ పథకాలు అందడం కష్టమైపోతుంది.

- ఆరిక శారద, సర్పంచ్, పీటీ మండ

పరిష్కరించాలి..

ఏపీ ఫైబర్ నెట్ ద్వారా సిగ్నల్స్ అందేలా చూడాలి. తూతూ మంత్రంగా పనులు చేపట్టి.. ఒకట్రెండు రోజులకే సిగ్నల్స్ పరిమితమయ్యేలా చేయకూడదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- అడ్డాకుల భారతి, సర్పంచ్, టీకే జమ్ము

ఆందోళన చేస్తాం

ఫైబర్ నెట్ విషయంలో కచ్చితమైన చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రత్యామ్నాయ మార్గాలు ద్వారా ఏజెన్సీవాసులకు డిజిటల్ సేవలు అందేలా చూడాలి. ఈ సమస్యను పరిష్కరించకుంటే గిరిజనులతో కలిసి ఆందోళన చేస్తాం.

- కొల్లి సాంబమూర్తి, సీఐటీయూ నాయకుడు, కొమరాడ మండలం

పునర్జన్మనిచ్చారు



శిశువుతో ఆస్పత్రి వైద్యులు

పాలకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండక ముందే పురిటి నొప్పులతో వచ్చిన ఓ గర్భిణీకి పాలకొండ శ్రీవిజయ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేసి, శిశువుకు పునర్జన్మనిచ్చారు. ఈసందర్భంగా ఆస్పత్రి ఎండీ దూబ పద్మావతి మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కొత్తూరుకు చెందిన త్రివేణి అనే గర్భిణీ ఇటీవల పురిటి నొప్పులతో తమ ఆస్పత్రిలో చేరారని చెప్పారు. అయితే గర్భం దాల్చిన ఏడో నెలలోనే పురిటి నొప్పుల వచ్చాయని, ఆ సమయంలో పుట్టిన పిల్లలు బతకడం చాలా కష్టమని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించాల్సి వస్తుందన్నారు. తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ నిర్వహించి, శిశువును బతికించామని తెలిపారు. చిన్న పిల్లల వైద్యుడు సంపత్‌కుమార్ పర్యవేక్షణలో 24గంటలు వైద్యసేవలు అందించారన్నారు. మగ బిడ్డ పూర్తిగా ఆరోగ్యవంతంగా ఉందని ఆమె తెలిపారు. ఇటువంటి ప్రీటెర్మ్ ఆపరేషన్లు ఈనెలలో ఆరు నిర్వహించామని ఆమె చెప్పారు.

కమిషనర్ వ్యవహార శైలి బాగోలేదు

● మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరీ

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాలకవర్గ సభ్యులతో వ్యవహరిస్తున్న తీరు బాగోలేదని మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరీ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మార్చి నెలలో ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఏప్రిల్ నెలలోనైనా సాధారణ, బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని కోరితే, ఇదిగో.. అదిగో అంటూ తాత్సారం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికి 20 రోజులుగా సమావేశాల నిర్వహణకు సంబంధించి కమిషనర్‌ను కోరుతుంటే కనీసం ప్రజాప్రతినిధులపై గౌరవం లేదన్నారు. కమిషనర్ వ్యవహార శైలిపై కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అంతే కాకుండా పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలో కమిషనర్ అడ్డుపుల్లలు వేస్తున్నారని, దానికి సంబంధిత అధికారులు సహాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు కమిషనర్ వ్యవహార్శైలి విమర్శలకు తావిస్తోందన్నారు. ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన పాలకవర్గ సభ్యులు ప్రజలతో మాటలు పడాల్సి వస్తోందని ఆమె వాపోయారు. కమిషనర్ మార్పుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఒకే ఒక్క రోజు..

● పన్నుల వసూళ్లకు ముగుస్తున్న గడువు

● ఉరుకులు పెడుతున్న రెవెన్యూ అధికారులు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లకు ఈనెల 30వ తేదీ ఒకే ఒక్క రోజు గడువు ఉండడంతో మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఉరుకులు పెడుతున్నారు. అవకాశం ఉన్నంత వరకు ప్రభుత్వ, ప్రైవేటు పన్నులు వసూలు చేసేందుకు కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారి రూబేను, ఆర్‌ఐలు వినయ్, ఈశ్వరరావులు, సచివాలయ అధికారులతో వెళ్తున్నారు. 2025-26కు గాను పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.10.75 కోట్లు కాగా ఈ ఆర్థిక సంత్సరానికి ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎవరయితే పన్నులు చెల్లిస్తారో వారికి 5శాతం రాయితీ ఇచ్చారు. అయితే పన్నుల చెల్లింపుకు సంబంధించి 5 శాతం రాయితీపై రెవెన్యూ అధికారులు కష్టపడినప్పటికీ ఫలితం లేదనే చెప్పాలి. రూ.10.75 కోట్లకు గాను మంగళవారం సాయంత్రానికి రూ.1.20 కోట్లు అయినప్పటికీ రెవెన్యూ అధికారుల పడ్డ కష్టానికి ఫలితం ఇంకా రాలేదనే చెప్పాలి. 30వ తేదీ సాయంత్రం 6 గంటలతో 5శాతం రాయితీ ముగుస్తుండడంతో మిగతా సుమారు రూ.9 కోట్లు పన్నులు వసూలు చేసేందుకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది మళ్లీ పరుగులు పెట్టాల్సిన అవసరంఉంది.

రెండో రోజూ..

● కొనసాగిన ఎన్ఎంయూ నాయకుల రిలే దీక్ష

● ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజు మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు ఆర్టీసీ డిపోల వద్ద ఎన్ఎంయూ సభ్యులు రిలే దీక్షల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ఈహెచ్ఎస్ వైద్య విధానాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్లు రిమూవల్స్‌ను అరికట్టాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. జీవో నెం.114లో పొందుపరిచిన మేర కు నైట్ అవుట్ అలవెన్సులను రూ.150ల నుంచి రూ.400లకు పెంచాల ని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు. ఈ దీక్షలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



సాలూరు: రిలే దీక్షల్లో పాల్గొన్న ఎన్ఎంయూ నాయకులు



పాలకొండ: రిలే దీక్షల్లో ఎన్ఎంయూ నాయకులు



పార్వతీపురంటౌన్‌లో..

భద్రగిరి ఆస్పత్రి అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు

● భవన నిర్మాణాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ జగదీశ్వరి, డీసీహెచ్ఎస్ నాగశివజ్యోతి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న భద్రగిరి 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చెయ్యాలని ప్రతిపాదనలు పంపడం సంతోషకరమని, ఇలా అయితే గిరిజన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న ఈ భవనాన్ని ఆమెతో పాటు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) నాగశివజ్యోతి మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా నాగశివజ్యోతి మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. దానికి సంబంధించి ఇక్కడ ఉన్న అవకాశాలను పరిశీలించడానికి వచ్చామన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు మెరుగైన వైద్య సేవలు కోసం దూర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని, ఈ తరుణంలో ఈ ప్రాంతంలో అన్ని సౌకర్యాలతో వంద పడకల ఆసుపత్రి పూర్తయితే ఏజెన్సీ ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు రమ్య, రాజన్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కోలా రంజిత్‌కుమార్, టీడీపీ కురుపాం మండల కన్వీనర్ కొండయ్య, నాయకులు పాల్గొన్నారు.



డీసీహెచ్ఎస్ నాగశివజ్యోతితో కలిసి ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

● నూతనంగా నియమితులైన డీసీహెచ్ఎస్ నాగశివజ్యోతి తొలుత స్థానిక టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జగదీశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజెన్సీలో ఉన్న గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే ఆమెకు సూచించారు.

మెరుగైన సేవలు అందించాలి

కురుపాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ నాగశివజ్యోతి ఆదేశించారు. మంగళవారం ఆమె కురుపాం సీహెచ్‌సీని సందర్శించారు. ఆసుపత్రిలో గల వార్డులు, రికార్డులు, ల్యాబ్, ఐసీటీసీ, బ్లెడ్ బ్యాంకు, మొదలైనవి పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి భవనం పరిశీలించారు. ఈసందర్భంగా వైద్యధికారులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి అందుతున్న సేవలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం నర్సిపురం గ్రామంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల ప్రజలు రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు తదితర వాటిపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

బేబీ ఫీడింగ్ సెంటర్ ప్రారంభం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బేబీ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు అభినందనీయం అని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. దివంగత వ్యాపారవేత్త పస్తుమర్తి వెంకటరామారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సెంటర్ ఏర్పాటుకు సహకరించిన లయన్స్ క్లబ్ అధ్యక్షులు బీఎస్‌బీరావు, కార్యదర్శి పి.బుజ్జి, కోశాధికారి బీవీఎస్ నాయుడులను ఎమ్మెల్యే అభినందించారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి

● నూతన చైర్‌పర్సన్‌కు ఎమ్మెల్యే జయకృష్ణ సూచన



చైర్‌పర్సన్ మల్లీశ్వరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని నూతన చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆమెను అభినందించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడారు. తనకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన కూటమి ప్రభుత్వానికి, స్థానిక రెల్లికుల అభివృద్ధి సంఘానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు, రెల్లికుల సంఘం నాయకులు మజ్జి బాబ్జీ, జెవర ప్రసాద్, లోకొండ గణేష్, పిన్నింటి బాలరాజు, కొట్నాన అప్పన్న, సొండి సింహాచలం తదితరులు పాల్గొన్నారు. ● నగర పంచాయతీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మల్లీశ్వరికి కూటమి పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, పాలకొండ ఎంపీపీ బొమ్మాళి భాను, సుధాకరరావు దంపతులు అభినందనలు తెలిపారు. ● టీడీపీ నాయకుడు పల్లా కొండలరావును నూతనంగా ఎన్నికైన నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూ ర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సత్కరించారు. పార్టీలకతీతంగా పని చేస్తూ పాలకొండను అభివృద్ధి బాటలో నడపాలని కొండలరావు ఆమెకు మార్గనిర్దేశం చేశారు.

కిశోర బాలికల సమగ్రాభివృద్ధికి చర్యలు

బలిజిపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందని ఐసీడీఎస్ పీవో ఎస్.సులేఖ తెలిపారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేసిన వర్క్‌షాపులో ఆమె పాల్గొని, మాట్లాడారు. మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోర బాలికలకు సెలవుల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీవోతోపాటు లీగల్ ప్రొహిషన్ ఆఫీసర్ పి.శ్రీధర్, ఓఆర్‌డబ్ల్యూ హరికృష్ణ, సూపర్‌వైజర్ పద్మావతి, మహిళా సంరక్షణ అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐలో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

సాలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐ శిక్షణ కోసం ఈనెల 28వ తేదీ నుంచి మే 24వ తేదీలోగా ఫస్ట్ పేజ్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు సాలూరు ఐటీఐ శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ వి.రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే నెల 24వ తేదీ సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలు కోసం 9052508903, 8886789002 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

సీతంపేట రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణులు కానీ విద్యార్థులకు నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు సంబంధించి ఏర్పాట్లను డీడీ అన్నదొర మంగళవారం పరిశీలించారు. బాలురకు స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలోను, బాలికలకు బాలికల ఆశ్రమ పాఠశాలలోను ఈ ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు డీడీ తెలిపారు. బుధవారం నుంచి శిక్షణను ప్రారంభిస్తామని చెప్పారు. డీడీతో పాటు డిప్యూటీ డీఈవో కేఆర్‌పీ కుమార్, జీసీడీవో రాములమ్మ, ఏఎంవో కోటిబాబు,హెచ్‌ఎంలు ఉన్నారు.

బహిరంగసభను విజయవంతం చేయండి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజన హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ మే 7వ తేదీన చేపట్టే ర్యాలీ, బహిరంగ సభకు విజయవంతం చేయాలని ఆదివాసీ ఐక్య గిరిజన సంఘాల జేఏసీ నేతలు కోరారు. ఈసందర్భంగా జేఏసీ నేతలు ఆరిక చంద్రశేఖర్ ఇంటికుప్పాల రామకృష్ణ, లోవరాజు, సీతారాం, భూషణ్, తిరుపతిరావు మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గిరిజనుల కోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని కోరారు.

ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ నిర్వహించాలని గిరిజన సంక్షేమ సంఘం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, గిరిజన విద్యార్థి సంఘం ట్రైబుల్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద వారు మాట్లాడారు. ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు, మువ్వల అమర్‌నాథ్, పల్లా సురేష్, పాలవలస భగవాన్ పాల్గొన్నారు.

హైరిస్క్ గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

సీతంపేట రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో ఉన్న 159 మలేరియా హైరిస్క్ గ్రామాల్లో వచ్చే నెల 2వ తేదీ నుంచి జూన్ 14వరకు మొదటివిడత మలేరియా స్ప్రేయింగ్ నిర్వహిస్తామని సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు తెలిపారు. మంగళవారం స్ప్రేయింగ్‌కు సంబంధించి వివరాలను ఆయన వెల్లడించారు. రంగు, వాసన లేని ఆల్ఫా సైఫర్ మెట్రిన్(ఏసీఎం)మందను గిరిజన గ్రామాల్లో పిచికారీ చేయిస్తామని చెప్పారు.

నేడు పారమ్మతల్లికి చందనోత్సవం

సాలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలంలోని పారమ్మకొండ కింద వెలసిన పారమ్మతల్లికి బుధవారం చందనోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్తలు, నవోదయ యువసేవా సమితి సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు విష్ణుమూర్తి స్వరూపంగా, రెండో రోజు ఈశ్వర స్వరూపంగా, మూడో రోజు అమ్మవారి స్వరూపంగా పారమ్మతల్లి దర్శనం ఇస్తారని చెప్పారు. బుధవారం ఉదయం 5గంటలకు పంచామృత అభిషేకం, గోపూజ, 8 గంటలకు అమ్మవారి దర్శనం, హోమం నిర్వహిస్తారని తెలియజేశారు.

అ'పూర్వ' కలయిక

వీరఘట్టం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. సుమారు 40ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయుడు, విశ్రాంత ఎంఈవో భోగి సత్యానంద మాస్టారును సన్మానించారు.



40 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వ్యాపారమ్మ పండగకు శ్రీకారం



కళశాలతో ఆలయం వద్దకు చేరుకున్న మహిళలు

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం గ్రామ దేవత వ్యాపారమ్మ పండగకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గ్రామంలోని మహిళలు కళశాలతో ఊరేగింపు చేసి, అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. పసుపు నీళ్లతో అమ్మవారికి చల్లదనం చేశారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

భామిని, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైశాఖమాసం మంగళవారం పురస్కరించుకుని బత్తిలి గ్రామ దేవత ముత్యాలమ్మను పెద్దవీధి యువత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించి ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధుల్లో పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్దకు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి ముర్రాటలతో చల్లదనం చేశారు.

నేడు పైడితల్లి అమ్మవారి నిజరూప దర్శనం

వీరఘట్టం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ఇలవేల్పు పైడితల్లి అమ్మవారు బుధవారం భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నారని ప్రముఖ యజ్ఞకర్త సర్వాజోస్యుల శర్మయాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్షయ తృతీయ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున రానున్నారని, రాత్రి 9 గంటల వరకు దర్శనాలు ఉంటాయని చెప్పారు.

న్యూస్ బాక్స్

ఎమ్మార్సీ కార్యాలయం తాత్కాలిక మార్పు

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల వనరుల శిక్షణ కేంద్రాన్ని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవనంలోకి తాత్కాలికంగా మార్పు చేసినట్టు ఎంఈవో బి.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలోని అన్ని యాజమాన్యాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని తెలియజేయాలని కోరుతున్నామని చెప్పారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

పాలకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ ఎస్‌జేవీ రత్నంరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని ఆంజనేయనగర్, నీలమ్మవీధి, టీచర్స్ కాలనీలు, ప్రధాన రహదారి, ఏలాం, దేవరపేట, కోమటిపేట, కొండవీటి తదితర చోట్ల కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై పాలకవర్గంతో చర్చించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

బత్తిలి సర్పంచ్‌కు ఎమ్మెల్యే కోండ్రు పరామర్శ

భామిని, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బత్తిలి సర్పంచ్ టింగ అన్నాజీరావు మాతృమూర్తి చిన్నపిల్లమ్మ ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మంగళవారం ఆయన్ని పరామర్శించారు. పాత స్నేహం, బంధుత్వం ఉండడంతో పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ రాజాం అధ్యక్షుడు జగదీష్‌చంద్ర, మోహన్, శిర్ల అశోక్ తదితరులు ఉన్నారు.

టచ్చిడిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కురుపాం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): టచ్చిడి గ్రామంలోని తాగునీటి సమస్యపై 'నీరు లేక ఊరు ఖాళీ' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాము తదితర అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో గల బావిలో మోటారును అమర్చి గ్రామస్థులకు నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నారు. మిగతా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా సాలూరు వాసి



వెంకటరావు

సాలూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం యాద్రాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈవోగా ఐఏఎస్ అధికారి, సాలూరువాసి సుతాపల్లి వెంకటరావును నియమిస్తూ ఆ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడు రోజుల్లో బాధ్యతలను చేపట్టనున్నారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జీఏడీలో ప్రోటోకాల్ కార్యదర్శిగా, ఎండోమెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్యం మెరుగుకు అన్ని చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం సీతంపేట గ్రామ సచివాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించి సర్వేలు, పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలపై సమీక్షించారు.